
# పందెం

-పి.బాల

ప్రొద్దుట నుండి బేరాలు చాలా బాగున్నాయి. రిక్షా అప్పిగాడికి చాలా సంతోషంగా ఉంది. మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యింది. మెల్లగా రిక్షాను స్టాండులో నుండి తీసి ఇంటికి బయలుదేరాడు. మధ్యలో ఘుమ ఘుమ వాసన ముక్కును తాకాయి. అప్పిగాడికి ప్రాణం ఉన్నట్టుండి పులావ్ మీద లాగేసింది. రిక్షా కాస్త పక్కన పెట్టి మెల్లగా హోటల్ లోపలికెళ్ళాడు. ఫుల్‌గా పులావ్ లాగించేశాడు. బిల్లు కట్టి 'బ్రేవ్'మంటూ త్రేనుస్తూ బయటకొచ్చాడు. అంతలో చక్కనైన జంట మ్యాటీ సినిమాకి వెళ్తూ అప్పిగాడి రిక్షాను 'సినిమా హాలుకు వస్తావా?' అని అడిగారు. దాంతో అప్పిగాడికి ఈ రోజు 'నా రొట్టె విరిగి నేతిలో పడ్డది. వద్దంటే బేరాల మీద బేరాలు' అని తనలో తను సంతోషపడుతూ స్పీడుగా సినిమా హాలుకి చేరుకున్నాడు. ఆ జంట కాస్త డబ్బులిచ్చి గబగబా వెళ్ళిపోయారు.

'ఏంటి?! ఇయ్యాళ ఇన్ని బేరాలు తగిలేసాయ్!' అని తనలో తానే ఆలోచించుకొంటూ రిక్షా తొక్కుతూ ఒక్కసారిగా నాలిక్కర్చుకున్నాడు.

'ఓరి నా ఇయ్యాళ ఆటో బ్రదర్స్ స్ట్రయిక్ కదూ మరిచే పోయానూ' అంటూ బుర్ర మీద ఒక దెబ్బ కొట్టుకున్నాడు.




అంతలో కోలాహలంగా ఉన్న సుబ్బారావు టీ స్టాల్ కనిపించింది. అక్కడ ఒక్కటే జనం. ఒకరి మీద ఒకరు ఒరిగిపోయి మరీ ఉన్నారు. ఒకటే ఈలలు. తప్పట్లు. అప్పిగాడికి ఏమీ అర్థంకాలేదు. రిక్షాను రోడ్డుకు ఒకప్రక్కగా పెట్టి దిగి అక్కడకు వెళ్ళాడు. తీరా చూస్తే ఆ జనమంతా టీవీ చూస్తున్నారు. అప్పిగాడు కొద్దిగా కాళ్ళు పైకెత్తి టీవీ వంక చూశాడు. క్రికెట్ మ్యాచ్ కనిపించింది. అంతేకాదు. అక్కడ జనం చేతుల్లో నోట్లు కూడా మాటిమాటికి మారుతున్నాయి.

'ఏంటీ? కాస్తావా?' అన్నాడో వ్యక్తి ప్రక్కవాడితో.

'ఓ... ఇప్పుడు సిక్స్ కొడతాడు' అన్నాడు ఆ వ్యక్తి.

'సరే అయితే కొట్టడు వంద బెట్ సరేనా?' అన్నాడు మొదటివాడు.

ఇదంతా చూస్తున్నాడు అప్పిగాడు. ఒక్కసారిగా జనమంతా గొల్లుమన్నారు. మొదటి వ్యక్తి వంద నోటు రెండో వాడికి ఇచ్చేశాడు. అప్పిగాడికి అర్థమైంది అది సిక్సని. ఇదేదో బాగానే ఉందే! అని మనసులో అనుకొన్నాడు. సర్వర్ అక్కడ నిలబడ్డ వాళ్ళందరి దగ్గర్నుండి టీ ఆర్డర్ తీసుకుంటున్నాడు. అప్పిగాడు కూడా ఒక టీ ఆర్డర్ చేశాడు. జనమంతా ఒకటే హుషారులో టీవీ వంకే చూస్తూ టీ చప్పరిస్తున్నారు.

అప్పిగాడికి కూడా క్రికెట్ కొంత తెల్సు. సచిన్ టెండూల్కర్ అంటే మరీ తెలుసు. హోటల్ సుబ్బారావు దగ్గర పెద్దపెద్ద మొత్తాలు పందాలు కలుపుతున్నారు జనాలు. చిన్నచిన్న మొత్తాలు ఎవరికి వారే పందాలు కాసేసుకుంటున్నారు. అప్పిగాడికి కూడా మెల్లిగా బుర్రలో పందెం కాయాలన్పించింది. మెల్లగా జేబు వంక చూసుకున్నాడు. జేబు కూడా బరువుగా అనిపించింది. ప్రక్కన నిల్చున్న ఓ వ్యక్తి ఒంటి మీద చేతితో చరిచాడు. ఆ వ్యక్తి టీవీని వదిలి అప్పిగాడ్ని చూశాడు గుర్రుగా.

'ఎవరెవరు ఆడుతున్నారు?' అడిగాడు.

'ఇండియా, శ్రీలంక' చెప్పాడు ఆ వ్యక్తి.

'ఇండియా గెలుస్తాది' అన్నాడు అప్పిగాడు.

ఒక్కసారిగా అప్పిగాడి వంక జాలిగా చూశాడు ఆ వ్యక్తి.

'ఎలా చెప్పావ్?' అన్నాడు.

'అది అంతే' అన్నాడు అప్పిగాడు.

'పాపం పిచ్చోడు. వీడికి ఏమీ తెలియకలా వాగుతున్నాడు. ఇప్పటికే శ్రీలంక ఫస్టు బాటింగ్‌లో రెండొందల యాభై పరుగులు కొట్టింది. దాని మీద ఎక్కువ కొట్టాలంటే మనవాళ్లకి సాధ్యమా?' అనుకొన్నాడు ఆ వ్యక్తి.

'కావాలంటే పందెం కడతా?!' అన్నాడు అప్పిగాడు మెల్లగా.

ఆ వ్యక్తికి నవ్వొచ్చింది. 'ఒక్టి వెర్రిబాగులోడులా ఉన్నాడు. వీడి దగ్గర్నుండి మొత్తం లాగేస్తా పోలా?' అనుకొని 'ఎంత పందెం?' అన్నాడు.

అప్పిగాడు గబగబా జేబులో చిల్లరతోసహా మొత్తం లెక్కపెట్టాడు నూట ఇరవై ఉంది.

'ఆ... నూట ఇరవై' అన్నాడు.

'సరే... నువ్వు ఓడిపోతే నూట ఇరవై తీసుకుంటాను. నువ్వు గెలిస్తే రెండింతలు ఎక్కువ ఇస్తాను' అన్నాడు ఆ వ్యక్తి గెలుపు తనదే అన్నట్లు భరోసాగా.

'సరే' అని హుషారుగా మరో టీ అందుకొని మ్యాచ్‌లో మునిగిపోయాడు అప్పిగాడు.

ఇండియా టీమ్ అప్పటికే రెండు ఓవర్లు ఆడేసి పది పరుగులు సాధించింది. ఉన్నట్టుండి రపీల్మని వికెట్ పడిపోయింది. అక్కడి వారందరూ ఉసూరుమన్నారు. అప్పిగాడు మాత్రం ధైర్యంగానే ఉన్నాడు. ఇంతలో అప్పిగాడి వీరాభిమాని టెండూల్కర్ బాటింగ్‌కి వస్తున్నాడు. అప్పిగాడిలో ఒకటే హుషారు మొదలయింది. మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతుంది. బంతులన్నీ బౌండరీలను తాకుతున్నాయి. కొన్నైతే గాల్లో తేలుతూ గ్యాలరీలో పడుతున్నాయి. ప్రేక్షకులంతా ఒకటే కేకలు, ఈలలు వేస్తున్నారు.

'చూశావా? మా వాడు ఎలా కొడుతున్నాడో?' అన్నాడు పందెం కాసిన వ్యక్తితో వీరావేశంతో.

అంతలో సచిన్ కొట్టిన బంతి పైకి ఎగరగలిగినంత ఎత్తు ఎగిరి బౌండరీ లైన్‌లో క్యాచ్‌కు దొరికిపోయింది. జనంతా ఒకటే బాధపడిపోయారు. ఇంకొక్క రెండు పరుగులైతే సెంచరీ పూర్తయ్యేదని ఒకరిలో ఒకరు తెగ మాట్లాడేసుకుంటున్నారు. వెంటనే ప్రకటనలు తెర పైకి వచ్చేశాయి.

పాపం అప్పిగాడు కూడా డీలా పడిపోయి తింగర చూపులు చూస్తున్నాడు. పందెం కాసిన వ్యక్తి ఒక్కసారి ముసిముసిగా నవ్వాడు అప్పిగాడి అవతారం చూసి.

అప్పటికే స్కోరు నూట అరవై. మళ్లీ తరువాత ఆటగాల్లతో మొదలయిన మ్యాచ్‌లో మొత్తానికి ఎలాగైతే శ్రీలంక, ఇండియా చేతిలో ఓడి పోయింది. అప్పిగాడి పందెం డబ్బులు రెండొందల నలభై అదనంగా వచ్చేసింది. నెగ్గిన వారంతా హుషారుగా వెళ్ళిపోతున్నారు. ఓడిన వారు నీరసంగా నడుస్తున్నారు. అప్పిగాడు చాలా హుషారుగా ఇంటి దారి పట్టాడు. లక్కీలో లక్కీ అన్నట్టు నెగ్గిన ఓ వ్యక్తి తన ఇంటికి రిక్షా కడతావా?

అని అప్పిగాడ్ని అడగటంతో హుషారుగా ఆ బేరం ఒప్పేసుకున్నాడు. రిక్షా తొక్కుతూ 'బాబూ! మళ్ళా ఎప్పుడు ఈ ఆట జరుగుతాది?' అని ఆత్రంగా అడిగాడు.

'మళ్ళీ నాలుగు రోజుల తరువాత ఉంది' తిరిగి సమాధానం చెప్పాడు ఆ వ్యక్తి.

'ఎవరెవరికి మధ్య పోటీ బాబు!' ఉండబట్టలేక మళ్ళీ అడిగాడు అప్పిగాడు.

'ఇండియా - పాకిస్తాన్‌లకు' చెప్పాడు ఆ వ్యక్తి.

'ఆ రోజు ఇంకా జోరుగా ఉంటారు జనం. పందాలు హోరెత్తిపోతాయి. పైపెచ్చు ఆ రోజు శనివారం వచ్చింది. తప్పకుండా విజయం మనదే. అయినా కాకపోయినా వరల్డ్‌కప్‌లో పాకిస్తాన్ మనపై ఆడి గెల్చింది లేదు. ఆ రోజు పందెం కాస్తే డబ్బే... డబ్బు...' అంటూ అడక్కుండానే అన్ని వివరాలు అప్పిగాడికి చెప్పేశాడు.

ఇంతలో ఇల్లు వచ్చేసరికి ఆ వ్యక్తిని అక్కడ దింపేసి ఇంటి ముఖం పట్టాడు అప్పిగాడు.

రాత్రి పదిగంటలు దాటింది.

అప్పిగాడి కోసం ఎదురుచూస్తోంది భార్య శాంత. అంతలో అప్పిగాడి రిక్షా వచ్చి ఆగడంతో ఎదురెళ్ళి

'ఏందయ్యా ఎప్పుడూ లేదు ఈ ఆలస్యం ఏటయింది' ఆతృతగా అడిగింది.

'అయన్నీ ఇవరంగా చెప్తాగానీ' ముందు తానానికి నీళ్లెట్టు' అన్నాడు అప్పిగాడు.

స్నానం ముగించి కడుపారా తిన్నాడు. జరిగిన విషయం అంతా పూసగుచ్చినట్టు చెప్పి మొత్తం డబ్బులు శాంత చేతిలో పెట్టాడు. శాంతకు మాత్రం హుషారనిపించలేదు.

'చూడయ్యా మనం ఏ రోజుకారోజు కూలీ చేసుకొని బతికేటోళ్లం.... మనకెందుకు ఈ పందాలు? ఈ రోజు నెగ్గామని ఆనందపడితే, రేపు పోతే తట్టుకోలేమయ్యా... ఇలాటియన్నీ పెద్దోళ్లకి చెల్లాయి... ఇప్పుడు చేస్తే చేసావ్ గాని ఇంకెప్పుడు వీటి జోలికి పోకు' అని క్లాసు పీకింది.

అప్పిగాడికి మాత్రం చెముటోడి చెవిలో శంఖం ఊదినట్లు అనిపించింది. పైగా ఇంక నాలుగు రోజుల్లో ఇంకా పెద్ద అదృష్టం కలిసి రాబోతుంది. దీనికేం తెలుసు పిచ్చి మొహం అని తనలో తానే అనుకొంటూ ఆశల పల్లకీలో ఊరేగుతూ నిద్రలోకి జారుకున్నాడు.

• • •

ఆ రోజు రానే వచ్చింది.

ప్రొద్దున్నే అప్పిగాడు టింగురంగడులా తయారయ్యి బయలుదేరబోయాడు. ఇంతలో విచారంగా శాంతి కనిపించింది.

'ఏంటే? ఏటయ్యింది అలా ముఖం పెట్టావ్?' అన్నాడు చిరాగ్గా.

'ఏటి లేదు... రాత్రి నుండి చంటోడికి ఒంట్లో బాగా లేదు. ఒళ్లు ఒకటే కాలిపోతోంది. డాక్టరికాడికి తీసుకుపోదామంటే డబ్బు లేకపాయే... కనీసం ఈ పుస్తన్న తాకట్టు పెట్టి డబ్బు తీసుకురా... తొందరగా డాక్టరి దగ్గరికి పోవాలి' కన్నీళ్లతో చెప్పింది.

'మరైతే ఇప్పుడా చెప్పేది సరిసరి... నేనెళ్ళి గబీలున డబ్బు తెస్తానుండు' అంటూ స్పీడుగా బయలుదేరాడు. శేర్ దగ్గరకు వెళ్ళి వస్తువు తనఖా కోసం అడిగాడు.

'దాని మీద ఎనిమిది వందలు ఇస్తామంతే!' కటువుగా చెప్పాడు శేర్.

'అది కాదు శేర్. వెయ్యి రూపాయలు కావాలి' అంటూ క్రింద మీద పెట్టి శేర్‌ని ఒప్పించి డబ్బు తీసుకున్నాడు అప్పిగాడు. తిన్నగా ఇంటి ముఖం పట్టాడు. కాని మధ్య దారిలో సుబ్బారావు టీ స్టాల్ వద్ద జనం చాలా విపరీతంగా ఉన్నారు. ఇసకేస్తే రాలదు. అప్పిగాడికి రిక్షా పాసింజర్ చెప్పిన మాటలు పదేపదే గుర్తుకు వస్తున్నాయి. అంతేకాక శేర్‌ని ఒప్పించి వెయ్యి రూపాయలు గుంజింది కూడా ఆట మీద పందెం కాయాలనే. మెల్లగా జనం మధ్యకు చేరాడు. పందెంల జోరు భలే హోరుగా సాగుతోంది.

'ఏమయ్యా! పందెంలో నెగ్గావా? నువ్వు ఇంత జూదగాడివని తెలియక డబ్బు కోసం నిన్నంపాను. కనీసం పందెం కాసేటప్పుడన్నా నీకు మేము గుర్తుకు రాలేదా? సమయానికి నా అయ్య వచ్చాడు కనుక సరిపోయింది లేకపోతే నా బిడ్డ నాకు దక్కకపోను. అయినా కాకపోయినా నీకిదేం పాడుబుద్ధయ్యా!'

అప్పటికే ఆట మొదలయి అరగంట అయింది. ఫస్ట్ బాటింగ్ పాకిస్తాన్ చేస్తోంది. భారత్ బౌలింగ్ పేలవంగా సాగుతోంది. పాకిస్తాన్ స్కోర్ జోరుగా పరిగెడుతోంది. అప్పిగాడికి ఏమీ అర్థం కావడంలేదు. ఎవరు నెగ్గుతారని పందెం కాయాలో అర్థం కావడంలేదు. ఎలాగైతేనేం ధైర్యంచేసి భారత్ గెలుస్తుందని మొత్తం డబ్బు పందెం కట్టేశాడు. ఆటను తిలకించడంలో పూర్తిగా మునిగిపోయాడు. భార్యాబిడ్డను మర్చిపోయాడు. స్క్రీన్‌పై సచిన్‌ను చూస్తూనే మురిసిపోతున్నాడు. పాకిస్తాన్ జట్టు ఆట ముగిసింది. కొండంత స్కోర్ ముందు పెట్టింది. అందరూ కాస్త రిలాక్స్ అయ్యి మనోళ్ల ఆటతీరును ఊహిస్తూ కబుర్లతో టీని గుటకలేస్తున్నారు. అప్పిగాడికి ఒకవైపు భయం భయంగా ఉన్నా ఆశలన్నీ సచిన్‌పైనే పెట్టుకున్నాడు. పైగా బాగా తెలిసిన ఆటగాడు. మెల్లగా టీవీ ముందు వరుసలోకి చేరుకున్నాడు. భారత్ బ్యాటింగ్ మొదలయింది. అందరూ ఉత్సాహంగా కేరింతలు కొడుతున్నారు. ఠపీఠపీమని రెండు వికెట్లు రాలిపోయాయి. అప్పిగాడి గుండె గుబేలుమంది. ఒక్కసారిగా భార్యా బిడ్డ గుర్తుకు వచ్చారు. తిరిగి డబ్బులు అడిగేద్దామంటే ఇవ్వరు. ఎలా? అనుకొంటూ దీనంగా చూస్తున్నాడు. అప్పిగాడు హీరో సచిన్ రానే వచ్చాడు. హమ్మయ్య! ఎలాగైనా నెగ్గేస్తానులే అని మనసులో అనుకొన్నాడు. పాకిస్తాన్ బౌలర్ వేసిన బంతిని ఒక్కటి పీకాడు సచిన్. రయ్యిమని గాలరీలో పడింది. అప్పిగాడి ఆనందానికి అంతులేదు. రెండో బంతిని లాగిపెట్టి పీకాలని సచిన్ ప్రయత్నించేసరికి మిడిల్ వికెట్ ఎగిరిపోయింది. ఒక్కసారిగా అదిరిపడ్డాడు అప్పిగాడు. జనమంతా కుప్పకూలిపోయి ఓటమి గురించి తెగ చర్చించుకోవడం మొదలెట్టేశారు.

అప్పిగాడు పూర్తిగా డీలా పడిపోయాడు. 'మిగతా ఆటగాళ్లు ఎవ్వరూ నాకు పరిచయం లేదు. అయినా సచిన్ లాంటోడే ఆడలేక పోయాడు. ఈ కుర్ర కుంటలవల్ల ఏవవుతుంది' అనుకుంటూ ఉసూరుమంటూ టీవీ చూస్తున్నాడు.

ఇంతలో ఒక్కసారిగా అలజడి. జనం తలోదిక్కుకు పరిగెడుతున్నారు. అప్పిగాడు వెనక్కి తిరిగి చూసేసరికి పోలీసులు. దొరికిన వాళ్లను దొరికినట్లు జీపు ఎక్కిస్తున్నారు. టీ స్టాల్ సుబ్బారావుని అప్పిగాడ్ని కూడా ఎక్కించేశారు. పోలీసుస్టేషన్ అంతా హడావిడిగా ఉంది. ఎస్.ఐ. వెంకన్న బడాబడా బెట్టింగులు కట్టేవారందరి మీద మండిపడిపోతున్నాడు. పాపం అప్పిగాడి లాంటి వారందరినీ వరుసగా వరండాలో బెంచీపై కూర్చోబెట్టారు.

'త్రీనాట్ టూ' అంటూ అరిచాడు ఎస్.ఐ. వెంకన్న.

'ఎస్సార్...' అంటూ సెల్యూట్ చేసి నిలబడ్డాడు.

'ఆ... బెంచి మీద ఉన్న వాళ్లని ఇలా రమ్మను' అన్నాడు.

'వెళ్లండయ్యా... మిమ్మల్ని పిలుస్తున్నారు' అంటూ అప్పిగాడి బ్యాచ్‌కి చెప్పాడు త్రీనాట్ టూ.

అప్పిగాడితోసహా అందరూ ఎస్.ఐ. ఎదురుగా చేతులు జోడి కట్టి నిల్చున్నారు.

'ఏరా... మీరు చూస్తే కూలీ చేసుకునే వెధవల్లా ఉన్నారు. మీకు కూడా బెట్టింగులు కావల్సి వచ్చాయా? అప్పనంగా సొమ్ము సంపాదించేయాలని కలలు కంటున్నారా? లేబర్ వెధవ కనుక వదిలేస్తున్నాను. మరోసారి ఇలా దొరికారో?' అంటూ హెచ్చరించి 'పొండి' అంటూ గట్టిగా అరిచేడు.

అప్పిగాడితోసహా అందరూ పందెం డబ్బు అనలన్నా ఇచ్చేస్తారేమోనని ఎస్.ఐ. వంక కాసేపు చూసి నిరాశగా బయటకు వచ్చారు.

'మీ పందెం డబ్బు తక్కువ కనుక మీరు బ్రతికి బయటపడ్డారు. పెద్ద మొత్తాలోళ్లు పని అంతే మరి!' అంటూ బయట నిలబడ్డ సెంట్రీ అప్పిగాడితో అన్నాడు.

అప్పిగాడు బిక్కమొహంతో ఇంటి ముఖం పట్టాడు. ఇల్లు చేరేసరికి శాంత అప్పిగాడి వంక ఎర్రగా చూసింది. అప్పిగాడు సిగ్గుతో తలదించుకున్నాడు.

'ఏమయ్యా! పందెంలో నెగ్గావా? నువ్వు ఇంత జూదగాడివని తెలియక డబ్బు కోసం నిన్నంపాను. కనీసం పందెం కాసేటప్పుడన్నా నీకు మేము గుర్తుకు రాలేదా? సమయానికి నా అయ్య వచ్చాడు కనుక సరిపోయింది లేకపోతే నా బిడ్డ నాకు దక్కకపోను. అయినా కాకపోయినా నీకిదేం పాడుబుద్ధయ్యా! నీకు మొన్నే చెప్పాను కదయ్యా. అప్పన్నంగా వచ్చిన సొమ్ము మనకొద్దని' అంటూ ముఖం వాచిపోయేలా తిట్టిపోసింది శాంత.

'తప్పే చేసానే! నన్ను క్షమించు. ఇట్టాటి పని ఇంకెన్నడూ చేయను. కష్టపడి సంపాదించిన సొమ్మును తప్ప అప్పనంగా వచ్చిన దాన్ని ఆశించను' అంటూ ప్రాధేయంగా చెప్పాడు అప్పిగాడు.

'నాన్నా!' అంటూ మంచంపైనుండి పిలిచిన చంటోడ్ని నీళ్లు నిండిన కళ్లతో గుండెలకద్దుకొన్న అప్పిగాడికి వీధిలో మందుగుండు సామాగ్రి పేలుడు శబ్దం వినిపించింది.

భార్య కొడుకుతో వీధిలోకి వచ్చేసింది. 'ఇండియా విన్....' అంటూ జనం చేసే ఆనంద కోలాహలంలో పందెం నెగ్గినా డబ్బు పోగొట్టుకున్న విచారాన్ని అప్పిగాడు మరిచిపోయి సంబరపడ్డాడు.

★